సాక్షి సూర్యాపేట
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



తండ్రీకూతురు మృతి

భువనగిరి పట్టణంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు మృతి చెందారు.


- 8లో



ఏ తల్లి 'పాప'మో

ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లోని ముళ్లపొదల్లో సోమవారం పసికందును వదిలేశారు.

- 8లో



నాలుగు గేట్ల ద్వారా..

మూసీకి ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టు నాలుగు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

17న జాతీయ సమైక్యతా దినోత్సవం

సూర్యాపేట : ఈ నెల 17న జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సూర్యాపేటలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జెండా ఆవిష్కరణకు సంబంధించి కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

పేట మార్కెట్‌లో 15 నుంచి ఆన్‌లైన్ చెల్లింపులు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో అమలవుతున్న ఈనామ్ విధానంలో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి పంటలను అమ్ముకునేందుకు యార్డుకు వచ్చే రైతులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరపనున్నట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎండీ.ఫసీయొద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డుకు పంటలు అమ్ముకునేందుకు వచ్చే రైతులు ఇకపై ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ పాస్ పుస్తకం (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌తో సహా) తీసుకుని రావాలని ఆయన కోరారు.

తిరుమలగిరి మార్కెట్‌కు 179 బస్తాల పెసర్లు



తిరుమలగిరి మార్కెట్ యార్డులో పెసర్లు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 179 బస్తాల పెసర్లు వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. పెసళ్లకు గరిష్టంగా క్వింటాకు రూ.9,206, కనిష్టంగా రూ.7189 ధర పలికినట్లు పేర్కొన్నారు.

తమ్మరబండపాలెంలో ప్రభుత్వ భూమి సర్వే

సాక్షి ఎఫెక్ట్..

కోదాడ: కోదాడ మండలం తమ్మరబండ పాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. సర్వే నంబర్ 39లో 42 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ గురైన విషయాన్ని ప్రభుత్వ భూమి స్వాహా అనే శీర్షికన ఈనెల 1న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. సదరు భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. దీంతో సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ 39ని భౌతికసర్వే చేశారు. దీనిలో 17 మంది ఆక్రమణ దారులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నక్షా ప్రకారం సర్వే చేసి హద్దులు నిర్ణయించామని, రికార్డులను పరిశీలించి రెండు మూడు రోజుల్లో దీనిపై పూర్తి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆర్డీఓ కార్యాలయ సర్వేయర్ తెలిపారు. వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యూరియా కొరత రాకుండా చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఏఓ రామారావునాయక్

అర్వపల్లి: రైతులకు యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ తెలిపారు. అర్వపల్లిలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీచేసి మాట్లాడారు. జిల్లాలో రైతులకు అవసరానికి తగిన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏటులు, ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉండి యూరియా సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. జాజిరెడ్డిగూడెం మండలానికి మంగళవారం సాయంత్రం వరకు 100 టన్నుల యూరియా రానుందని తెలిపారు. యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళన చేందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. శశిధర్‌రెడ్డి, మనగ్రోమోర్ మేనేజర్ ఆకారపు కృష్ణ, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

చేప.. చెరువులోకి రావా!

ప్రారంభం కాని చేప పిల్లల పంపిణీ

- జలాశయాలు నిండుకుండల్లా ఉన్నా మత్స్యశాఖ 'మీన'మేషాలు
- టెండర్ల ఖరారుకు మూడు నెలల సమయంపై విమర్శలు
- అనుచరులకు కట్టబెట్టేందుకేనని ఆరోపణలు



సూర్యాపేట : జలాశయాలు నిండుకుండల్లా ఉన్నా.. టెండర్లు పూర్తయినా చేపల పంపిణీ విషయంలో మత్స్యశాఖ అధికారులు జాప్యం చేస్తుండడం గంగపుత్రులకు శాపంగా మారింది. టెండర్లు ఖరారు చేయడానికి అధికారులు మూడు నెలల సమయం తీసుకోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తమ అనుచరులకు టెండర్లు కట్టబెట్టేందుకే 'మీన'మేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

1,340 నీటి వనరుల్లో..

మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. ఈ చేపపిల్లలను టెండర్ల ద్వారా ఆయా గ్రామాల్లోని జలాశయాల్లో వదులుతున్నారు. జిల్లావ్యాప్తంగా 134 మత్స్య పారిశ్రామిక సంఘాలు, 3 మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాలు, 5 మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 15,736మంది సభ్యులు ఉన్నారు. కాగా జిల్లాలోని 1,340 నీటి వనరుల్లో 2023వ సంవత్సరం దాదాపు 3.50 కోట్ల చేపపిల్ల లను వదలాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం జూన్ 17న టెండర్ల ప్రక్రియను మొదలు పెట్టారు. సెప్టెంబర్ మొదటి వారంలో టెండర్ల ఖరారు చేశారు. నెలన్నరరోజుల్లో పూర్తికావాల్సిన టెండర్ ప్రక్రియకు మూడు నెలల సమయం పట్టింది. దీంతో చేపల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. చివరి దశలో అంతా హడావుడి చేసి పెద్ద ఎత్తున నిధులు గోల్‌మాల్ చేస్తున్నట్లు కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ సారైనా అడ్డుకట్ట పడేనా..

జిల్లాలో చేపల పంపిణీ సమయంలో ఏటా పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు మత్స్యకార సంఘాలు ఆరోపిస్తున్నాయి. చేప పిల్లల సైజ్, సంఖ్యలో భారీగా అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, ఈ తతంగంలో సంఘాలకు చెందిన పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో క్షేత్రస్థాయిలో మత్స్య కార్మికులకు న్యాయం జరగడం లేదని, కేవలం కొందరు దళారులు, కాంట్రాక్టర్లకే ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

ఈ వారంలో పంపిణీ చేస్తాం



జిల్లాలో 3.50 కోట్ల చేపపిల్లల పంపిణీకి టెండర్లు పూర్తయ్యాయి. ఇద్దరు కాంట్రాక్టర్లు పంపిణీకి ముందుకొచ్చారు. ఈ వారంలో చేపపిల్లల పంపిణీని చేపడుతాం. ఎలాంటి అవకతవకలు జరగకుండా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రూపేందర్‌సింగ్, మత్స్యశాఖ అధికారి

వారోత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలి



సూర్యాపేటలో ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను తెలంగాణ ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 17 వరకు నిర్వహించే సాయుధ పోరాట ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యాపేటలో ధర్మభిక్షం విగ్రహానికి పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లుతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటమం వీరోచితంగా సాగిందన్నారు. ఈ పోరాటంలో 4500 మంది ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, ఎస్కే లత్తు, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు దామల అశోక్, బొమ్మగాని శ్రీనివాస్, ఏఐటీయూసీ ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్, ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సభ్యులు శ్రీకాంత్, హరి, సైదులు, నాగరాజు, దీకొండ శ్రీనివాస్, రవి, రమేష్, రేగట్టి లింగయ్య, పొదిల లింగయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించకపోతే గద్దెదింపడం ఖాయం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పెరుగుతున్న ధరలు తగ్గించకపోతే ప్రజలే కేసీఆర్, మోదీలను గద్దె దింపడం ఖాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. అధిక ధరలు– నిరుద్యోగాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేటలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని తాకట్టు పెట్టే పనిలో మోదీ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాటలతో కాలం గడుపుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు దండ వెంకటరెడ్డి, మేకపోయిన సైదమ్మ, వీరబోయిన రవి, మేకరంబోయిన శేఖర్, వేల్పుల వెంకన్న, ఎల్గూరి గోవింద్, నాయకులు ఆవిరి అప్పయ్య, రణపంగ కృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు, నాయకులు వల్లపు దాసు సాయికుమార్, పందిరి సత్యనారాయణ రెడ్డి, యాతాకుల వెంకన్న, మద్ది అంజిబాబు పాల్గొన్నారు.

టెట్ పేపర్–1కు 31 కేంద్రాలు



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

- అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- అధికారులతో సమావేశంలో కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)ను పకడ్బందీగా నిర్వహించాలని, పేపర్–1కు 31 కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. ఈనెల 15న టెట్‌ను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఎ.వెంకట్ రెడ్డితో కలిసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పేపర్–1 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని కోసం సూర్యాపేటలో 7,200 మంది అభ్యర్థులకు 30 కేంద్రాలు, కోదాడలో 197 మంది అభ్యర్థులకు ఒక కేంద్రం ఇలా మొత్తం 31 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5గంటల వరకు నిర్వహించే పేపర్–2 పరీక్షకు సూర్యాపేటలో 28 కేంద్రాలు, కోదాడలో 1 కేంద్రం ఇలా మొత్తం 29 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్ష కోసం సూర్యాపేటలో 6,654 మంది, కోదాడలో 10 మంది ఇలా మొత్తం 6,664 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఆరు రూట్లు ఏర్పాటు చేశామని, అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టాలని సూచించారు. పరీక్ష రోజు అన్నికేంద్రాల వద్ద 144 సెక్షన్ తప్పక అమలు చేయాలని, నిరంతర విద్యుత్, మంచినీరు, ఏఎన్‌ఎంతో మెడికల్ స్టాల్ ఏర్పాటు చేయాలని కోరారు. రూట్ల వారీగా బస్సులు నడపాలని ఆదేశించారు. ముందుగా చీఫ్ సూపరింటెండెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు 31 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 123 మంది హాల్ సూపరింటెండెంట్లు, 309 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఈఓ అశోక్, డీఎస్పీ రవి పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజలు అందించిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్ రెడ్డి లతో కలసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. భూసమస్యలకు సంబంధించి 33, ఇతర శాఖలకు సంబంధించి 6 దరఖాస్తులు అందినట్లు వివరించారు. అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా వైద్యాధికారులు చొరవ చూపాలన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలోఅందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీఏఓ రామారావు నాయక్, డీఏహెచ్ ఏ శ్రీధర్ గౌడ్, డీపీఓ యాదయ్య, సీపీఓ జి.వెంకటేశ్వర్లు, సంక్షేమ అధికారులు జ్యోతి పద్మ, శిరీష, శంకర్, అనసూర్య పాల్గొన్నారు.

ప్రతినెలా 5వ తేదీలోగా పెన్షన్ ఇవ్వాలి

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు పెన్షన్‌ను ప్రతి నెలా 5వ తేదీలోగా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 15వ తేదీ దాటినా పెన్షన్ ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు మంత్రులు, ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందించడం లేదని పేర్కొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

- పీఎంశ్రీ రెండో విడత ఎంపికకు తనిఖీలు
- జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ
- ఎంపికైన బడుల్లో సకల వసతులు
- ఇప్పటికే మొదటి విడతలో జాతీయ స్థాయిలో 22 స్కూళ్లు ఎంపిక



హుజూర్‌నగర్‌లోని పాఠశాలలో వసతులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

హుజూర్‌నగర్ : మారిన పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) అనే పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా సిలబస్‌తో పాటు బోధనా పద్ధతుల్లో మార్పులు చేయనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పాఠశాలల్లో తనిఖీలు చేసి 22 స్కూళ్లను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఇక రెండో విడత ఎంపిక కోసం తనిఖీల ప్రక్రియ కొనసాగుతోంది.

అత్యుత్తమ విద్య కోసం..

విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించడానికి కేంద్రం మూడు దశల్లో పాఠశాలల ఎంపిక ప్రక్రియ చేపట్టింది. మొదటి దశలో కేంద్ర ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాఠశాలకు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలి. రెండో దశలో యూడైస్ ప్లస్ వివరాలను పరిగణనలోకి తీసుకుంటారు. రెండు దశల్లో ఎంపికైన పాఠశాలల్ని మూడో దశలో స్థానికంగా ఉండే కేంద్రీయ, నవోదయ విద్యాలయాల సిబ్బంది క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి పాయింట్లు కేటాయిస్తారు. ఇందులో భాగంగా పట్టణ ప్రాంత పాఠశాలలు 70 శాతం, గ్రామీణ ప్రాంత బడులు 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతాల చొప్పున నిధులు కేటాయిస్తాయి. వీటితో పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి అత్యుత్తమ విద్య అందిచాలనేది ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

సకల వసతులు

తుది ఎంపిక జరిగిన పాఠశాలల్లో వసతులు కల్పిస్తారు. శుద్ధమైన తాగునీరు, ప్రయోగశాల, డిజిటల్ గ్రంథాలయం, ఇంటర్‌నెట్ కనెక్షన్, వృత్తి విద్య కోర్సుల అమలు, క్రీడా సామగ్రి, సౌరవిద్యుత్‌కు ప్యానెల్ ఏర్పాటు చేయడం, పోషకాహార తోట, ప్లాస్టిక్ రహితంగా మార్చడం, నాణ్యమైన విద్యను అందిస్తారు.

ఫైనల్‌కు ఎన్ని పాఠశాలలో..

జిల్లాలో మొత్తం 165 పాఠశాలలు ఉండగా వాటిలో తొలి విడతలో 22 పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపికయ్యాయి. రెండో విడతలో 143 పాఠశాలలు ఉండగా వాటిలో 92 స్కూళ్లు జిల్లా స్థాయిలో పాస్ కాగా 82 పాఠశాలలు రాష్ట్ర స్థాయిలో పాస్ అయ్యాయి. వాటిలో ఎన్ని పాఠశాలలు ఫైనల్‌గా జాతీయ స్థాయిలో ఈ పథకానికి ఎంపిక కానున్నాయో తెలియాల్సి ఉంది.

తుది జాబితాలో చోటు దక్కితే అనేక వసతులు



పీఎంశ్రీ తుది జాబితాలో పాఠశాలకు చోటు దక్కితే అనేక వసతులు అందుబాటులోకి వస్తాయి. వాటిని అందిపుచ్చుకోవడానికి ఈ సారి ఎక్కువ పాఠశాలలు ఎంపికయ్యేలా జిల్లా ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించి తగిన సలహాలు ఇచ్చాం. దీని వల్ల విద్యార్థులకు మరింత నాణ్యమైన వసతులు సమకూరుతాయి.

– బి. సైదా నాయక్, మండల విద్యాధికారి, హుజూర్‌నగర్

పోషణ్ మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పోషణ్ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. పోషణ్ మహోత్సవ నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డిలతో కలసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వీరికి పౌష్టికాహారం అందించాలన్నారు. పిల్లలకు సకాలంలో ఇమ్యునైజేషన్ జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి జ్యోతిపద్మ, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఏఓ రామారావు నాయక్, డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డీఈఓ అశోక్, డీఎస్‌సీడీఓ దయానందరాణి, డీసీఎం మోహన్ బాబు పాల్గొన్నారు.

సాహిత్య శిఖరం.. కాళోజీ

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

రామగిరి(నల్లగొండ) : సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తన కలంతో తిరుగుబాటు జెండాను ఎగురవేసిన సాహిత్య శిఖరం కాళోజీ నారాయణరావు అని సినీగేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ కొనియాడారు. కాళోజీ 109 జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'కాళోజీ జీవితం సాహిత్యం' అనే అంశంపై నిర్వహించిన సాహిత్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సరళమైన పద జాలంలో సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా అర్థవంతమైన సాహిత్యాన్ని అందించిన గొప్ప కవి కాళోజీ అని గుర్తు చేశారు. అన్ని భావాలను అలవోకగా పలికించగల గొప్పదనం తెలంగాణ యాసకే సొంతమన్నారు. బడి పలుకుల భాష కాకుండా పలుకుబడుల భాష కావాలని కాళోజీ కోరినట్లే ప్రజల భాషకు పట్టం కట్టాల్సిన అవసరం ఉందన్నారు. మరో వక్త ఎన్‌వి.రఘువీర ప్రతాప్ 'నా గొడవ – సామాజికత' అనే అంశంపై ప్రసంగించారు. కాళోజీ ప్రజల గొడవను తన గొడవగా భావించి కవిత్వం ద్వారా ప్రజల్ని ఆలోచింపజేశాడని అన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ మున్నీర్, తెలుగు శాఖ ఇన్‌చార్జి డాక్టర్ వివి.సుబ్బారావు, అధ్యాపకులు డాక్టర్ ఎన్.దీపిక, ఎన్.లవీందర్‌రెడ్డి, డాక్టర్ సీతారామ్‌రాథోడ్, డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, డాక్టర్ టి.సైదులు, జి.గోవర్ధనగిరి, ఎస్.ప్రభాకర్, లింగస్వామి, బి.రమ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీయాక్ట్ సెల్‌తో పర్యవేక్షణ

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: పీడీయాక్ట్ పెట్టే అవకాశం ఉన్న నేరస్తులను గుర్తించడానికి ప్రత్యేకంగా పీడీయాక్ట్ సెల్ ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సీఐడీ అదనపు డీజీపీ మహేష్ భగవత్ సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రెండేళ్లుగా 8 మందిపై పీడీయాక్ట్ నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 14 ఫిర్యాదులు

పోలీస్ గ్రీవెన్స్‌లో 14 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. బాధితులనుంచి ఫిర్యాదులను స్వీకరించి ఎస్పీ మాట్లాడారు. ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారి పట్ల, మహిళలను వేధించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ

అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె నోటీసు



స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణికి సమ్మె నోటీసు ఇచ్చి వస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు

భానుపురి (సూర్యాపేట) : వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్మికులు ఇచ్చిన పిలుపు మేరకు సూర్యాపేట జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిణి జ్యోతిపద్మను కలెక్టరేట్ లో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకులు యాకలక్ష్మి, భాస్కరమ్మ, మంగమ్మ, ఎండ్లపల్లి పద్మ, నాయకులు సాయికుమార్, యాతాకుల వెంకన్న, రణపంగు కృష్ణ, రవి, జానిబేగం, జయమ్మ, వసంత, వనజ తదితరులు పాల్గొన్నారు.

16న సదరన్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్టివల్

సూర్యాపేటటౌన్ : ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో జిల్లా స్థాయి సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ కె.అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. చిరు ధాన్యాల ప్రాముఖ్యత, ఆహార భద్రత, నిజ జీవితంలో టెక్నాలజీ, సమాజంలో మూఢనమ్మకాల పాత్ర అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కృషి చేయాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సెల్ నంబర్ 9989457087ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

బంగారు గొలుసు లాక్కెళ్లిన హిజ్రాలు

చౌటుప్పల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని హిజ్రాలు ఆపి అతడి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. లింగోజిగూడేనికి చెందిన యు. రమేష్ బైక్‌పై స్వగ్రామం నుంచి చౌటుప్పల్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లింగోజిగూడెం గ్రామ శివారులోని హైవే–9 హోటల్ ఎదురుగా రోడ్డు పక్కన నిల్చున్న నలుగురు హిజ్రాలు రమేష్‌ను ఆపి అతడితో మాట్లాడుతూ మెడలోని తులం బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితుడు వెంటనే చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

13మందిని కరిచిన కుక్క



కుక్క కరిచిన మహిళకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

నేరేడుచర్ల: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఓ కుక్క సోమవారం చిన్నపిల్లలు, వృద్ధులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే 13 మందిని కరిచింది. కుక్కకాటుకు గురైన లింగయ్య, అనూష, జాని, సైదమ్మ, రజిత, శ్రీనివాస్‌రెడ్డి, ఎలిషా, తిరుపతమ్మ, లింగమ్మ, ప్రశాంతి, సైదమ్మ, లక్ష్మా, రజితను నేరేడుచర్ల పీహెచ్‌సీకి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతున్నారు. బాధితులను బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రాపోలు నవీన్, పట్టణ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తక్కెళ్ల నాగార్జున తదితరులు పరామర్శించారు.

ఎస్వీ కళాశాలను ప్రభుత్వపరం చేయాలి



ర్యాలీ తీస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర (ఎస్వీ) డిగ్రీ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం ఎత్తివేయాలని, కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కళాశాలను బంద్ చేయించి అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలో సంవత్సరానికి 1600 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. సూర్యాపేటకు 50 కిలోమీటర్ల దూరం నుంచి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ కళాశాలలో చదువు కోసం వస్తున్నారని తెలియజేశారు. తక్షణమే ప్రభుత్వం, మంత్రి చొరవ తీసుకొని కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్, రహీం, సాయి, అబ్దుల్, శివ, విష్ణు, నరేష్, శృతి, సుధా, వైష్ణవి, రేణుక పాల్గొన్నారు.

ఈ అభాగ్యుడిని ఆదుకోరూ..

- రెండు కిడ్నీలు పాడై మంచానికే పరిమితమైన యువకుడు
- వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయిస్తున్న తల్లిదండ్రులు
- దాతలు సాయం చేయాలని వేడుకోలు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబం

కన్నీటి గాథ



నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేందర్



తాటి నరేందర్

రామన్నపేట: రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద చేనేత కుటుంబానికి అనుకోని ఆపద వచ్చి పడింది. చేతికి ఎదిగిన కుమారుడు చేదోడువాదోడుగా ఉంటాడని ఆ తల్లిదండ్రులు అనుకుంటున్న సమయంలో అతడి రెండు కిడ్నీలు పాడై మంచాన పడ్డాడు. దీంతో తమ కొడుకు పరిస్థితిని చూసి ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ కుమారుడిని కాపాడాలని దాతల ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలు.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన తాటి విజయలక్ష్మి, వీరస్వామి దంపతులది నిరుపేద చేనేత కుటుంబం. వీరస్వామి రోజువారీ చేనేత కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు నరేందర్ ఉన్నారు. కుమార్తెల వివాహం అయ్యింది. ఎంబీఏ పూర్తిచేసిన నరేందర్ మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. దీంతో ఆ కుటుంబం తమ కష్టాలు తీరుతాయని సంతోష పడింది. కానీ విధి వక్రీకరించి నరేందర్ ఉద్యోగంలో చేరిన కొన్నాళ్లకే ఒకరోజు అకస్మాత్తుగా కింద పడిపోయాడు. ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించగా రెండు కిడ్నీలు పాడయ్యాయని వైద్యులు తెలిపారు.

మూడేళ్లుగా వైద్యం..

గత మూడేళ్లుగా నరేందర్‌కు మెరుగైన వైద్యం చేయించేందుకు అతడి తల్లిదండ్రులు దొరికిన చోటల్లా అప్పులు చేశారు. అయినా నరేందర్ ఆరోగ్యం మెరుగుపడకపోగా ఇటీవల మరింత క్షీణించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో వారానికి రెండు రోజులు డయాలసిస్ చేయిస్తున్నారు.

కిడ్నీ ఇచ్చేందుకు తల్లిదండ్రులు సిద్ధపడినా..

నరేందర్ తల్లిదండ్రుల ఆరోగ్యం కూడా వయోభారం చేత అంతంత మాత్రంగానే ఉంటుంది. అయినప్పటికీ కొడుకుకు కిడ్నీ దానం చేసేందుకు సిద్ధపడి వైద్య పరీక్షలు చేయించారు. కానీ వారి కిడ్నీలు అతడికి సరిపోవడం లేదని వైద్యులు తెలిపారు. దీంతో జీవన్‌ధాన్ కింద రిజిస్టర్ చేసుకున్నప్పటికీ ఇప్పట్లో అతని వంతు వచ్చే అవకాశం కనిపించడం లేదు. వారానికి రెండుసార్లు డయాలసిస్ కోసం ఇంటి నుంచి నిమ్స్ ఆస్పత్రికి పోయి రావడానికి ఖర్చులకు కూడా డబ్బులు లేక ఆ కుటుంబం నానా ఇబ్బందులు పడుతోంది. దయార్ధ హృదయులు ఆర్థికసాయం చేసి తమ కుమారుడి జీవితాన్ని కాపాడాలని అతడి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

సాయం చేయదలచిన వారు సంప్రదించాల్సిన నంబర్లు

బ్యాంక్ అకౌంట్ నంబర్ : 62324593693
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్0021425
ఎస్‌బీఐ, వెల్లంకి బ్రాంచ్
ఫోన్ పే, గూగుల్ పే నంబర్: 9182171882

ఏ తల్లి 'పాప'మో..!

- అప్పుడే పుట్టిన పసికందును ముళ్లపొదల్లో వదిలేసిన వైనం
- ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్‌లో ఘటన



చెట్ల పొదల్లో దొరికిన శిశువు



108 సిబ్బందికి శిశువును అప్పగిస్తున్న ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది

ఆత్మకూర్ (ఎస్) : ఏ తల్లి 'పాప'మో తెలియదు. అప్పుడే పుట్టిన పసికందు.. భారమనుకొని పేగుబంధాన్ని మరిచింది. కనీసం బొడ్డు పేగును తెంపకుండానే.. కన్నప్రేమను చంపుకుంది. పసికందును ముళ్లపొదల్లో వేసిన ఘటన సోమవారం ఉదయం ఆత్మకూర్ (ఎస్) మండలంలోని నెమ్మికల్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మికల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న చర్చి పక్కనే ముళ్లపొదలు ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున అటువైపు వెళ్తున్న వారికి శిశువు ఏడుపు వినిపించింది. వెంటనే కొందరు వెళ్లి శిశువును కంపచెట్ల నుంచి బయటకు తీశారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఉన్నతాధికారులకు విషయం తెలిపి శిశువును సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పసికందు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఎవరి పాపై ఉంటుందో..?

నెమ్మికల్‌లోని కంప చెట్లలో శిశువు కనిపించడంతో ఎవరి పాపై ఉంటుందోనని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. దండుమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో దాదాపు 4, 5 రోజులుగా సందడి నెలకొంది. ఆదివారం పండుగ చివరి రోజు కావడంతో బంధుమిత్రుల రాకతో నెమ్మికల్‌లో రాత్రి వరకు కోలాహలంగా ఉంది. మరి అప్పుడే పుట్టిన ఈ శిశువును చెట్ల పొదల్లో ఎవరు వేసుంటారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలోని వ్యక్తులు వేశారా..? లేదంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి గ్రామంలో వదిలి వెళ్లారా అన్నది తెలియడం లేదు. అయితే ఇతర గ్రామస్తులు వదిలి వెళ్లేందుకు పెద్దగా అవకాశం లేనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాపను వదిలేసిన ప్రాంతం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉంటుంది. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రధాన రహదారితో ఎలాంటి సంబంధం లేదు. పైగా గ్రామంలో లోపలికి ఉంటుంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సీసీ కెమెరాలు లేకపోవడంతో..

గ్రామంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో పాపను వదిలేసిన వ్యక్తులు ఎవరు.. ఎక్కడి నుంచి వచ్చారన్నది గుర్తించడం సాధ్యపడలేదు. మొదటగా గ్రామంలో డెలివరీకి ఉన్న మహిళలు ఎవరు..? అని ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీల ద్వారా కూపీ లాగితే అసలు విషయం బయటపడే అవకాశముంది.

తీర్పు పాటించకుంటే చర్యలు తప్పవు

- సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ జగన్నాథరావు



విచారణ నిర్వహిస్తున్న ట్రిబ్యునల్ చైర్మన్ జగన్నాథరావు

చౌటుప్పల్: ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పును పాటించకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ జగన్నాథరావు అన్నారు. ట్రిబ్యునల్‌ని ఆశ్రయించిన పోచంపల్లి మండలం మెహర్‌నగర్‌కు చెందిన ఆకుల శాంతమ్మ, వలిగొండ మండలం కేర్చిపల్లికి చెందిన ఉంగరాల యాదగిరి, రామన్నపేట మండలం ఎన్నారానికి చెందిన బొక్క కౌసల్య ఫిర్యాదులపై సోమవారం ట్రిబ్యునల్‌లో విచారించారు. మూడు కేసులను ఈనెల 30కి వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తులను అనుభవించడమే కాకుండా తల్లిదండ్రులను చివరి వరకు మంచిగా చూసుకోవాలన్నారు. ట్రిబ్యునల్ వరకు రాకుండా పోషణ, సంరక్షణ విషయంలో ఏ లోటు రానియొద్దన్నారు. ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాక వెలువడే తీర్పును అమలు చేయాల్సిందేనన్నారు. ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. తమ బిడ్డలను చూసుకుంటున్న మాదిరిగానే తల్లిదండ్రులను కూడా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రిబ్యునల్ సభ్యుడు, న్యాయవాది ముత్యాల సత్తిరెడ్డి, సెక్షన్ అధికారి సురేంద్రశర్మ తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో కారు, బైక్

అనంతగిరి: బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. అనంతగిరి మండలంలోని బొజ్జగూడెంతండా శివారులో సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన బాడిషా సాయిరాం, అదే గ్రామానికి చెందిన దరిపల్లి ప్రసాద్, అతడి రెండేళ్ల కుమారుడు దరిపల్లి సామ్రాట్ సోమవారం గోకినపల్లి గ్రామం నుంచి నల్లబండగూడేనికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో బొజ్జగూడెంతండా శివారులో కోదాడ నుంచి ఖమ్మం వైపు వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిరాం, ప్రసాద్, సామ్రాట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. బాడిషా సాయిరాం తండ్రి గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తె మృతి

- బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం
- భువనగిరి పట్టణ శివారులో ఘటన



కుమార్తె, కుమారుడితో హరి (ఫైల్)

భువనగిరి: బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. సోమవారం తెల్లవారుజామున భువనగిరి పట్టణంలో జరిగిన ఈ ప్రమాదంలో కుమార్తె అక్కడికక్కడే మృతిచెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా తండ్రి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన మోర హరి(38)కు భార్య అశ్విని, కుమార్తె ప్రణతి, కుమారుడు మోహిత్ ఉన్నారు. హరి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. హరి ఆదివారం భార్యాపిల్లలతో కలిసి బైక్‌పై వలిగొండ మండలం దుప్పల్లి గ్రామంలో శుభకార్యానికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున బైక్‌పై తిరిగి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు బయల్దేరాడు. వీరు భువనగిరి పట్టణ శివారుకు చేరుకోగానే రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో హరి కుమార్తె ప్రణతి(5) అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రగాయాలపాలైన హరితో పాటు అతడి భార్య, కుమారుడిని భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో హరి మృతిచెందాడు. ప్రణతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ సీఐ సుధీర్‌కృష్ణ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

- బస్సు దిగుతుండగా కిందపడి మహిళా ప్రయాణికురాలికి గాయాలు

నకిరేకల్: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా పొగలు వచ్చాయి. ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన నకిరేకల్ శివారులో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు బయల్దేరింది. మార్గమధ్యలో ఉదయం 6గంటల సమయంలో నకిరేకల్ శివారులోని నగేష్ హోటల్ సమీపంలోకి రాగానే విజయవాడ–హైదరాబాద్ హైవేపై బస్సులో వెనుక నుంచి ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. బస్సులో ఉన్న 45 మంది ప్రయాణికులు కిందకు పరుగులు తీశారు. ఈ క్రమంలో నకిరేకల్‌కు చెందిన జి. మమత బస్సు మెట్లు దిగుతుండగా కిందపడడంతో ఆమె తలకు దెబ్బలు తగిలాయి. ఆమెను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో నుంచి దిగిన ప్రయాణికులను ఇతర ఆర్టీసీ బస్సుల్లో వారి గమ్యస్థానాలకు పంపించారు. బస్సు వైరింగ్‌లో షార్ట్ సర్క్యూట్ వలన పొగలు వ్యాపించి ఉండవచ్చని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

సూర్యాపేట రూరల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన సూర్యాపేట మండలంలోని రూప్లాతండాలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసాయిగూడెం గ్రామ శివారులో చెట్ల కొమ్మలు ఎల్‌టీ లైన్‌కు తగులుతున్నాయి. దీంతో కరెంట్ ట్రిప్పు అవుతూ విద్యుత్ లైన్లు తెగుతున్నాయి. వాటిని సరిచేసేందుకు అసిస్టెంట్ లైన్‌మెన్ సత్యనారాయణ, రూప్లా తండాకు చెందిన ధరావత్ నాగరాజు (24) చెట్ల కొమ్మలు నరుక్కుంటూ ఎల్‌టీ లైన్ క్లియర్ చేస్తున్నారు. ఈ క్రమంలో లైన్‌కు దగ్గరలో ఉన్న 11 కేవీ వైరుకు ప్రమాదవశాత్తు నాగరాజు కుడి చేయి తగిలింది. దీంతో నాగరాజు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎంజీయూలో కాంట్రాక్టు అధ్యాపకులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



ఎంజీ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు



ఆర్ట్స్ బ్లాక్ పరిపాలనా విభాగం వద్ద నినాదాలు చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

ఎంజీయూ (నల్లగొండ రూరల్): తమ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంజీయూలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్రమ దోపిడీ, అధిక పనిభారం, మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. దశాబ్దకాలంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా.. సమాన వేతనం లేదన్నారు. అదేవిధంగా కాంట్రాక్టు అధ్యాపకులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో 140 రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోని కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజ్ చేసిన విధంగానే యూనివర్సిటీలోనూ కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, నాగయ్య, ప్రగతి, రామచంద్రుడు, రవీందర్‌రెడ్డి, మౌనిక, శంకరాచారి, శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయురాలికి ఉత్తమ ట్రైనర్ అవార్డు



జయప్రకాష్ నారాయణ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కవిత

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయురాలు నారాయణ కవిత సోమవారం హైదరాబాద్‌లో ఇంపాక్ట్ ఫౌండేషన్ వారి ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ అండ్ ట్రైనర్ అవార్డును రిటైర్డ్ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

యాదాద్రిలో ఎంపీ మిథున్‌రెడ్డి పూజలు



ఎంపీ మిథున్‌రెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి వెంకటేష్

యాదగిరిగుట్ట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంపీ మిథున్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు పూజలు చేశారు. మిథున్ రెడ్డి, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ప్రొటోకాల్ అధికారి వెంకటేష్ లడ్డూ ప్రసాదం అందజేశారు.

జీఓ నంబర్ 2 రద్దు చేయాలి

మిర్యాలగూడ టౌన్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులలో రిజర్వేషన్లు అడ్డుకునే జీఓ నంబర్ 2ను ప్రభుత్వం రద్దు చేయాలని బంజారా ఉద్యోగుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త రోస్టర్ ప్రకారం ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. పదోన్నతి కల్పించే ప్రతి పోస్టులోనూ రిజర్వేషన్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై స్పందించాలని కోరారు. తర్వలో చేపట్టనున్న ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రమోషన్లలోనూ అడక్వాసి విధానాన్ని తొలగించాలని కోరారు. సమావేశంలో గోపినాయక్, మక్లానాయక్, శంకర్‌నాయక్, జమ్లానాయక్, సైదానాయక్, మోతీలాల్, లాలునాయక్ తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్‌ది ప్రజాస్వామిక ఉద్యమం

భానుపురి (సూర్యాపేట): ఎస్సీ వర్గీకరణ కావాలని ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమం ప్రజాస్వామికమైందని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్యయాదవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. హక్కుల కోసం ఉద్యమించాలన్న అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ఎమ్మార్పీఎస్ ఉద్యమం కొనసాగుతుందని, ఈ ఉద్యమానికి ప్రజాస్వామ్య వాదులంతా మద్దతు తెలపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోవడం దారుణమన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి తెలంగాణ జనసమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే సీపీఐ (ఎంఎల్) రామచంద్రన్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి చామకూరి నరసయ్య, దళిత బహుజన మహాసభ ఉమ్మడి నల్ల గొండ జిల్లా అధ్యక్షుడు నారబోయిన వెంకట్‌యాదవ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు బొజ్జ వెంకన్నమాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టల మల్లేష్, నాయకులు ఎర్ర వీరస్వామి, పట్టణ ఇన్‌చార్జి దైద వెంకన్న, దాసరి వెంకన్న, తాటిపాముల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి మూసీ ప్రాజెక్టుకు సోమవారం 3,941 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో అధికారులు ప్రాజెక్టు నాలుగు క్రస్టు గేట్లను ఒక అడుగు పైకెత్తి 2,979సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 434 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి మొత్తం 3,312 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటిమట్టం 643.85 అడుగుల మేర నీరు ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.16 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది జూన్ నుంచి నేటి వరకు ప్రాజెక్టు ద్వారా 20.23 టీఎంసీల వరద నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉదయనిధి స్టాలిన్‌ను ఉరితీయాలి



ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టౌన్: సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను ఉరితీయాలని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, రమేష్‌రెడ్డి, దాసోజు యాదగిరిచారి, పాలకూరి రవిగౌడ్, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, కొండ భవానిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.